నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు!

- అర్ధంతరంగా నిలిచిపోయినవి కొన్ని ప్రారంభానికి నోచుకోనివి మరికొన్ని
- రూ. లక్షల్లో ప్రభుత్వ నిధులు వృథా
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



అర్ధంతరంగా నిలిచిపోయిన మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్



ప్రారంభానికి నోచుకోని జెడ్పీ అతిథిగృహం

యాచారం: ప్రజావసరాల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలు కొన్ని నిరుపయోగంగా తయారయ్యాయి. మరికొన్ని భవన నిర్మాణ పనులను అర్ధంతరంగా నిలిపేశారు. ప్రాంభానికి నోచుకోని భవనాల్లో విషసర్పాలు, జంతువులకు, అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో పదేళ్ల కాలంలో రూ. 5 కోట్లకు పైగా నిధులు వెచ్చించి పాఠశాలల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ రాజ్ జెడ్పీ నిధులతో నిర్మించిన భవనాలు, మార్కెట్ దుకాణ సముదాయాలు, ఆర్టీసీ బస్టాండ్‌లు వంటి వాటిని ప్రారంభించి ఆపేశారు. ప్రతి భవనాన్ని మొదట్లో నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. కొన్ని భవనాల పనులను పిల్లర్లు పోసి, స్లాబ్ వేసే వరకు చేపట్టారు. ఆ తర్వాత నిధులు లేవనే సాకుతో వదిలేశారు. ఈ క్రమంలో అధికారులు మారినా, ప్రజాప్రతినిధుల పదవీ బాధ్యతలు ముగిసినా ఆ భవనాలకు మాత్రం గ్రహణం వీడడం లేదు. వాటిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకరావడం లేదు.

అతిథి గృహానికి నిధులు కరువు

యాచారం మండల కేంద్రంలోని మండల పరిషత్ సముదాయ ప్రాంగాణంలో పదేళ్ల క్రితం రూ. 25 లక్షల జెడ్పీ నిధులతో అతిథి గృహ నిర్మాణ పనులు ప్రారంభించారు. మరో రూ.5 నుంచి రూ.10 లక్షల నిధులు ఖర్చుచేస్తే వాడుకలోకి వచ్చే అవకాశం ఉండేది. కాని ఎంపీపీలు, ఇద్దరు జెడ్పీటీసీలు, ఐదు మంది ఎంపీడీఓలు మారినా జెడ్పీ అతిథి గృహాన్ని పూర్తి చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్థానిక నాయకులు చెబుతున్నారు. అదే విధంగా మాల్‌లో రూ. 25 లక్షల నిధులతో నిర్మించిన కూరగాయల మార్కెట్ సముదాయ దుకాణాలు, నల్లవెల్లి, నక్కర్తమేడిపల్లి తదితర గ్రామాల్లో రూ. లక్షలాది నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. మాల్‌లోని నల్లవెల్లి చౌరస్తాలో 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారింది.

నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు

యాచారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో రూ. లక్షలాది నిధులతో నిర్మించిన భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రూ. కోటిన్నర నిధులతో సమావేశపు హాల్ నిర్మాణ పనులను స్లాబ్ వరకే పూర్తిచేశారు.

మొదటి అంతస్తులో దుకాణాలు, రెండో అంతస్తులో సమావేశ మందిరం నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సంకల్పించారు. కాని నిధుల కొరత వల్ల నిర్మాణ పనులు నిలిపేశారు. ఇలా మండల పరిధిలోని పలు గ్రామాల్లో పలు శాఖలకు చెందిన భవనాలు నిధుల కరువుతో పనులు ముందుకు సాగలేదు. వాటిని పూర్తి చేయించడంలో అధికారులు పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా ప్రస్తుత ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వాటిని పట్టించుకుని భవన నిర్మాణ పనులను పూర్తి చేయించాలని, వాడుకలోలేని భవనాలు వాడుకలోకి తెచ్చేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించండి



మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలకు ఆయాపనుల మీద వచ్చే ప్రజలకు మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని పలుమార్లు మండల పరిషత్ సర్వసభ్యసమావేశాల్లో ప్రస్తావించాను. తహసీల్దార్ కార్యాలయానికి నిత్యం వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం వందలాది మంది వస్తుంటారు. వారికి మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదాయంపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంపై లేకపోవడం బాధాకరం.

– దంతుక పెద్దయ్య, మాజీ సర్పంచ్, నానక్‌నగర్

ప్రజాధనం వృథా



రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు పూర్తి కాక అర్ధంతరంగా నిలిచిపోయాయి. వాటిని పూర్తి చేయించే అధికారులు, నాయకులు లేరు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రూ. లక్షలాది నిధులతో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. మరి కొన్ని నిర్మాణాలు పూర్తి కావచ్చిన వినియోగంలోకి తెచ్చేవారు కరువయ్యారు. దీంతో ప్రజాధనం లక్షల్లో వృథా అయ్యాయి.

– అలంపల్లి నర్సింహా, సీపీఎం మండల కార్యదర్శి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా



మండల కేంద్రంలోని జెడ్పీ అతిథి గృహం సమావేశం హాల్ నిర్మాణ పనులు పూర్తి చేయించడానికి రూ.35 లక్షల వరకు నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. అదే విధంగా మండలంలోని పలు గ్రామాల్లో నిలిచిపోయిన భవనాలను పూర్తి చేయించాలని వారికి విన్నవించాను.

– నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ యాచారం

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతి



అమరేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

తుర్కయంజాల్: కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కమ్మగూడలోని 22వ వార్డు, ప్రగతి నగర్ ఫేజ్2 కాలనీ వాసులు మంగళవారం కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. తమ కాలనీలో అంతర్గత డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మస్కతి డెయిరీ, ఎస్‌వీఆర్ కంపెనీ నుంచి వెలువడే పొగ, ధ్వని కాలుష్యం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కమిషనర్ దృష్టికి తెచ్చారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకట సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు ఆర్. వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

సీపీఎం మండల కమిటీ సభ్యుడు విఘ్నేష్



చెక్కు అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని సీపీఎం ఇబ్రహీంపట్నం మండల కమిటీ నాయకుడు పల్లపు విఘ్నేష్ పేర్కొన్నారు. కప్పపహాడ్ గ్రామానికి చెందిన పగిల్ల వెంకటేష్, జంగిలి దాసు, జంగిలి అనితలకు వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సింహారెడ్డి సహకారంతో వెంకటేష్‌కు రూ.51వేలు, జంగిలి దాసుకు రూ.15,500, అనితకు రూ.18వేలు మంజూరైన చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గ్రామ కార్యదర్శి జంగిలి ప్రభుదాసు, శాఖ కార్యదర్శులు రాజశేఖర్, సీహెచ్ సురేష్, గుడాల భిక్షపతి, మాజీ వార్డు సభ్యులు ఇందిర, గోపి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

కాంగ్రెస్ నాయకుడు పవన్ వాల్మీకి



శివసేనారెడ్డితో పవన్ వాల్మీకి

తలకొండపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాలని జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు పవన్ వాల్మీకి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిని కోరారు. మంగళవారం తుక్కుగూడలో శివసేనారెడ్డిని మర్యాద పూర్వకంగా ఆయన కలిశారు. ఈ సందర్భంగా వారు క్రీడలపై చర్చించారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, తదితర క్రీడలను గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించినట్లైతే ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించొచ్చన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు, మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని శివసేనారెడ్డి దృష్టికి ఆయన తెచ్చారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

మహిళా అధ్యక్షురాలు విజయరెడ్డి



మాట్లాడుతున్న విజయరెడ్డి

మాడ్గుల: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మాడ్గుల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు విజయరెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మూసి పునరుజ్జీవనానికి చర్యలు చేపడుతుంటే అసత్య ఆరోపణలు చేస్తు బీఆర్ఎస్ నాయకులు పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. మంగళవారం మాడ్గులలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనను బీఆర్ఎస్ ఓర్వలేకే దుష్ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. మూసి ప్రక్షాళనతో నష్టపోయే ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తగిన పరిహారం అందించి ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంపత్ కుమార్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు దీర్ఘకాలిక రుణాలు

పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా

ఆమనగల్లు: రైతులు, వ్యవసాయదారులకు పీఏసీఎస్ ద్వారా దీర్ఘకాలిక రుణాలు ఇవ్వనున్నట్లు పీఏసీఎస్‌చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, వ్యవసాయదారులకు అందించే రుణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు మేకలు, గొర్రెల ఫామ్స్, ట్రాక్టర్, వ్యవసాయ పరికరాలు, పౌల్ట్రీ, డెయిరీ ఏర్పాటు కోసం దీర్ఘకాలిక రుణాలను మంజూరుచేస్తామన్నారు. అర్హులైన రైతులు దీర్ఘకాలిక రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆమనగల్లు, కడ్తాల మండలాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయిస్తామని ఆయన చెప్పారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే వరిధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,330 మద్దతుధర ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొనానరు. సన్నరకం వడ్లకు ప్రోత్సాహకంగా క్వింటాల్‌కు రూ.500లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసే కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మాడ్గుల పీఏసీఎస్ చైర్మన్ తిరుమల్‌రెడ్డి, ఆమనగల్లు పీఏసీఎస్ వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, డైరెక్టర్లు జోగు వీరయ్య, వెంకటయ్య, డీసీసీబీ ఆమనగల్లు శాఖ మేనేజర్ గోపాల్, పీఏసీఎస్ సీఈఓ దేవేందర్, సిబ్బంది పద్మాకర్‌రెడ్డి, అల్లాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్‌గుప్తా

మినీ మార్కెట్ ఏర్పాటు చేస్తాం

పీఏసీఎస్ చైర్మన్ వెదెరె హన్మంత్‌రెడ్డి



ఆరుట్లలో స్థల పరిశీలన చేస్తున్న హన్మంత్‌రెడ్డి, బాలశంకర్, వెంకట ప్రసాద్ తదితరులు

మంచాల: ఆరుట్ల ప్రాథమిక రైతు సహకార సంఘం భవన సముదాయంలో మినీ మార్కెట్ ఏర్పాటు చేస్తామని మంచాల పీఏసీఎస్ చైర్మన్ వెదెరె హన్మంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆరుట్ల గ్రామంలో మార్కెట్ భవన నిర్మాణానికి ఖాళీ స్థలం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి శనివారం ఆరుట్ల రామాలయం చౌరస్తాలో రోడ్లపై సంత నిర్వహిస్తున్నారన్నారు. దీంతో రైతులు, కొనుగోలుదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నూతన మార్కెట్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు, వారి సహకారంతో మినీ మార్కెట్ ఏర్పాటు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాలశంకర్, తహసీల్దార్ వెంకట ప్రసాద్, పీఏసీఎస్ డైరెక్టర్ జెనిగె వెంకటేష్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రావులభాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

- నాయీబ్రాహ్మణ సేవాసంఘం ఉపాధ్యక్షుడు దశరథం
- ఎంబీబీఎస్ సాధించిన సాయినాథ్‌కు సత్కారం



విద్యార్థి సాయినాథ్‌ను సత్కరిస్తున్న నాయీబ్రాహ్మణ సేవాసంఘం నాయకులు

ఆమనగల్లు: ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించాలని నాయీబ్రాహ్మణ సేవాసంఘం ఉపాధ్యక్షుడు కానుగుల దశరథం, మండలశాఖ గౌరవ అధ్యక్షుడు పెరికేటి యాదయ్యలు పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన ఊర్మిళ, రాధాకృష్ణ మూర్తి దంపతుల కుమారుడు సాయినాథ్ నీట్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు. ఈ నేపథ్యంలో పట్టణంలో విద్యార్థి సాయినాథ్‌ను, తల్లిదండ్రులు ఊర్మిళ, రాధాకృష్ణమూర్తిలను కూడా సత్కరించారు. ఈ సందర్భంగా కానుగుల దశరథం, పెరికేటి యాదయ్యలు మాట్లాడారు. విద్యార్థులకు సరైన ప్రోత్సాహం ఇస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు కానుగుల గణేశ్, పట్టణ అధ్యక్షుడు రమేశ్, జంపుల యాదగిరి, బాలు, రామచంద్రయ్య, రాజు, సురేశ్, అడివయ్య, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఈఈ రవీందర్‌రెడ్డి

ఆమనగల్లు: పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నూతనంగా రూ.17.50 కోట్లతో నిర్మిస్తున్న ఆస్పత్రి భవన నిర్మాణ పనులను మంగళవారం పంచాయితీరాజ్‌శాఖ ఈఈ రవీందర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ రవీందర్‌లు పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రిభవనం జాతీయ రహదారి కంటే ఎత్తు తక్కువలో నిర్మిస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాలనుసారం వారు పనులను పరిశీలించారు. జాతీయ రహదారికంటే రెండుఫీట్ల ఎత్తులో బేస్‌మెంట్ నిర్మించి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో భవన నిర్మాణ పనులను ఈఈ రవీందర్‌రెడ్డి, డీఈఈ రవీందర్‌లు పరిశీలించారు. ప్రస్తుతం స్లాబ్ నిర్మాణానికి వేసిన సెంట్రింగ్‌ను తొలగించి బేస్‌మెంట్ ఎత్తును పెంచి స్లాబు వేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ బాల్‌రెడ్డి, స్థానిక నాయకులు మెకానిక్ బాబా తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు పోరాటం

ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ ఇంచార్జి ఆకాశ్‌చారి

షాద్‌నగర్: విద్యారంగంలో నెలకొన్న సమస్యల సాధనకు తాము నిరంతరం పోరాటం చేస్తామని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) షాద్‌నగర్ ఇన్‌చార్జి ఆకాశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారన్నారు. గత పాలకుల హయాంలో విద్యావ్యవస్థ అంతా గాడితప్పిందని విమర్శించారు. మార్పు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు విజయ్‌చారి, నరేశ్‌రాథోడ్, రమేశ్, గణేశ్, తరుణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అవంతి కళాశాలలో ఓరియెంటేషన్ డే

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని గుంతపల్లి గ్రామంలో గల అవంతి విద్యాసంస్థలో ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని మంగళవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తెంశెట్టి శ్రీనివాస్‌రావు, ఎర్డీ సంస్థ వ్యవస్థాపకుడు అల్వాల దేవేందర్‌రెడ్డి, జెఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ సంతోషికుమారి హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. బీటెక్ పూర్తి చేసిన తర్వాత ఎంబీఏ, ఎంసీఏ చదివితే ఉద్యోగాల్లో రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపల్స్ రామచంద్రారెడ్డి, అజ్మత్‌హుస్సేన్, క్యాంపస్ ఇన్‌చార్జి బోసుబాబు, పీఆర్వో శ్రీనివాస్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్‌షిప్‌ను విజయవంతం చేయండి



కరాటే పోటీల కరపత్రాన్ని హీరో సుమన్‌కు అందజేస్తున్న మాస్టర్ రాజశేఖర్

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ కరాటే పోటీలను విజయవంతం చేయాలని మార్షల్ ఆర్ట్స్ ఫౌండర్ చీఫ్ ఆర్గనైజర్ జోగు రాజశేఖర్ తెలిపారు. నవంబర్ 10వ తేదీన నిర్వహించబోయే కరాటే పోటీల కరపత్రాన్ని సినీ నటుడు, కరాటే మాస్టర్ సుమన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ పోటీలను బొంగ్లూర్ గేటు సమీపంలోని అంతార రిసార్ట్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ సుమన్, సుదర్శన్, నర్సింహాచారి హాజరుకానున్నారని తెలిపారు. కావున విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

తలకొండపల్లి: వికసిత్ భారత్ 2024లో భాగంగా జంగారెడ్డిపల్లిలో మంగళవారం బీజేపీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు వికసిత్ భారత్‌లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. హరికాంత్‌చారి, మనోహర్, రామకృష్ణ, కేశవులు, మన్యం, ప్రశాంత్, శ్రీను, యాదయ్య, పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ కో ఆర్డినేటర్ సురేష్‌కుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సురేష్‌కుమార్

యాచారం: మానవ అక్రమ రవాణాలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ కోఆర్డినేటర్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణ నిర్మూలనపై మంగళవారం యాచారంలో అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మానవ అక్రమ రవాణ ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తుందని, దీన్ని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు, యువతులు, విద్యార్థినులకు కలిగే ఇబ్బందులపై చైతన్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీఓ తులసి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడు యాదయ్యను సత్కరిస్తున్న మహేశ్

ఆమనగల్లు: పట్టణానికి చెందిన జంతుక యాదయ్య ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఎంపికై ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించాడు. ఈ నేపథ్యంలో నూతన ఉపాధ్యాయుడిని అంబేడ్కర్ యువజనసంఘం అధ్యక్షుడు ఒగ్గు మహేశ్ ఘనంగా సన్మానించారు. యువజన సంఘం సభ్యులు బాలరాజు, శ్రీశైలం, కృష్ణ, అశోక్, మహేశ్, గిరి, కృష్ణ, మల్లేశ్, శేఖర్, శంకర్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయండి

ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అశోక్



న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్‌తో పోతుగంటి అశోక్ తదితరులు

కడ్తాల్: మండల పరిధిలో అన్ని గ్రామ పంచాయతీల్లోని 18 నుంచి 35 సంవత్సరాలలోపు మహిళలందరికీ కుట్టుమిషన్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేయాలని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) కార్యాలయంలో జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ అంజయ్యతో విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా అంజయ్యతో అశోక్ మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో మొదటి విడతగా కడ్తాల్ మండల కేంద్రంతో పాటు వంపుగూడ, చల్లంపల్లి, అన్మాస్‌పల్లి, కర్కల్‌పహాడ్ గ్రామాల్లోని దళిత మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అంజయ్య హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ వసంత, మురళీధర్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం



పనులకు శంకుస్థాపన చేస్తున్న జయశ్రీ

మున్సిపల్ చైర్‌పర్సన్ జయశ్రీ

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు పేర్కొన్నారు. 8వ వార్డులోని పోలీస్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పురప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కౌన్సిలర్లు వడ్డేపల్లి విద్యావిజేందర్ రెడ్డి, పసుల రాజేందర్, సిద్దంకి కృష్ణారెడ్డి, డీఈ శివానందం తదితరులు పాల్గొన్నారు.